రిమ్స్ ప్రిన్సిపాల్‌గా అప్పలనాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అప్పలనాయుడును ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అప్పలనాయుడును బదిలీపై ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా వస్తున్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ జె.కిషోర్‌ను ఉద్యోగోన్నతిపై పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా నియమించింది. ఇప్పటివరకు అక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ అల్లు పద్మజను విజయనగరం బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

- వరుస అల్పపీడనాలతో పెరుగుతున్న విస్తీర్ణం
- 22 మండలాల్లో సాధారణ వర్షపాతం
- ఐదు మండలాల్లో అధిక వర్షం
- జిల్లాలో 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో వరుస అల్పపీడనాల ప్రభావంతో ఇటీవల కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. జూన్, జూలై నెలల్లో సాధారణంగా కురవాల్సిన వర్షం కంటే ఆగస్టులో అధికంగా వర్షం కురవడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతోంది. ఈ సీజన్‌లో కురవాల్సిన వర్షం కంటే స్వల్ప శాతం మాత్రమే లోటు కనిపిస్తోంది. ఖరీఫ్‌కు మరో 28 రోజులు ఉండడంతో వర్షపాతం లోటు నుంచి గట్టెక్కవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఖరీఫ్-2025లో నిర్దేశించిన లక్ష్యం మేరకు పంటల సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అటు వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం పెరగడంతో రిజర్వాయర్లు, బ్యారేజీల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. మొత్తం మీద ఇప్పటివరకు సాగుకు సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో రెండు వారాలుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సాగు క్రమేణా పెరుగుతోంది. మందకొడిగా పంటలు సాగవుతున్నాయి. 2025 ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,07,488 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 3.80 లక్షల ఎకరాల్లో పంటలు వేయగలిగారు. మూడు వారాల కిందట సాగు 3.21 లక్షల ఎకరాలుగా నమోదైంది. ఈ సీజన్‌లో 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేయగా, ప్రస్తుతం 3.43 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. మొక్కజొన్న పంటలను 23,873 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 20,966 ఎకరాల్లో వేశారు. పత్తి పంటను 3,125 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, 1055 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేశారు. చెరుకు పంటను 2,623 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా 560 ఎకరాల్లో వేశారు.

ఆగస్టులో 47.62 మి.మీ అధిక వర్షం

జిల్లాలో ఈ ఏడాది వర్షపాతంలో కాస్త హెచ్చుతగ్గులు కనిపించాయి. సీజన్ ప్రారంభ నెల జూన్‌లో లోటు వర్షపాతం నమోదైంది. జూలైలోనూ లోటు వర్షపాతమే కొనసాగింది. ఆగస్టులో రెండు వారాల పాటు చినుకు చుక్క కరువైంది. మూడో వారం నుంచి వరుస అల్పపీడనాలు సంభవించడంతో కొంతమేర లోటు తీరింది. సీజన్ ప్రారంభమైన జూన్ ఒకటో తేదీ నుంచి సోమవారం వరకు సాధారణంగా 513.98 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటివరకు 501.77 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. జిల్లావ్యాప్తంగా 2.38 శాతం లోటు నమోదైంది. జిల్లాలో 30 మండలాలు ఉండగా 22 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఐదు మండలాల్లో అధిక వర్షం కురిసింది. మూడు మండలాల్లో ఇంకా లోటు కొనసాగుతోంది. జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 92 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. వర్షపాతం లోటు 31.8 శాతంగా నమోదైంది. జూలైలో 184.41 మి.మీ వర్షం పడాల్సి ఉండగా, 157.61 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టులో 181.94 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 229.56 మి.మీ వర్షం కురిసింది.

పెరిగిన భూగర్భ జలాలు

జిల్లాలో ఇటీవల కాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో, భూగర్భ జలాలు కొంతమేర పైకి వచ్చాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే 0.45 మీటర్ల మేర నీరు పైకి వచ్చింది. జిల్లాలో గతేడాది ఆగస్టులో సగటున 7.11 మీటర్ల మేర నీరు లభ్యం కాగా, ప్రస్తుతం 6.66 మీటర్ల అడుగున నీరు లభ్యమవుతోంది. రణస్థలంలో గరిష్ఠంగా 2.59 మీటర్ల మేర నీరు పైకి వచ్చింది. సోంపేటలో 2.49 మీటర్లు, ఇచ్ఛాపురంలో 2.41 మీటర్లు, ఆమదాలవలసలో 2.09 మీటర్ల మేర నీటిమట్టం నిల్వలు పెరిగాయి. జిల్లాలోని 25 మండలాల్లో నీటిమట్టం నిల్వలు పెరిగాయి.

రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు

వరుస అల్పపీడనాల ప్రభావంతో జిల్లాలోని రిజర్వాయర్లు, బ్యారేజీల్లో నీటిమట్టం నిల్వలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. అటు ఒడిశాలోనూ వర్షాలు పడుతుండడంతో గొట్టాబ్యారేజీ సామర్థ్యం మేరకు వంశధార నిల్వలు ఉన్నాయి. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ పూర్తి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.61 టిఎంసిల నీటి లభ్యత ఉంది.

వంశధారలో ఇన్‌ఫ్లో 9,515 క్యూసెక్కులు ఉండగా, అంతే పరిమాణంలో నీటిని కిందికి విడిచిపెడుతున్నారు. మడ్డువలస రిజర్వాయరు సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 2.79 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. తోటపల్లి రిజర్వాయరు సామర్థ్యం 2.53 టిఎంసిలు కాగా, పస్తుతం 2.07 టిఎంసిల నీరు ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు

- స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యం
- ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వచ్ఛ శ్రీకాకుళం సాధనతో సహా, స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించడానికి ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వచ్ఛతను ప్రజల దైనందిన జీవన విధానంలో భాగం చేయాలన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఒకరోజు కార్యక్రమంతో మాత్రమే కాకుండా ప్రతిరోజూ ప్రజల సహకారం, భాగస్వామ్యంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణపై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి సానుకూల స్పందన రావాలని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరు, పనుల ప్రణాళిక, మానిటరింగ్ వంటి అంశాలపై అధికారులు కచ్చితంగా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విద్య, వైద్యం, ఉపాధి, పారిశుధ్యం, మంచినీరు, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత వంటి అంశాలను సమగ్రంగా పరిగణిస్తూ, గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి అధికారి తన బాధ్యతను పూర్తిగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, డిఎల్‌పిఒలు రమణ, గోపీబాల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి - కవిటి

కొబ్బరి పంట సాగు, విక్రయాల్లో రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా కవిటిలోని చిక్కాఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో స్థానిక రైతులు తమ తోటల్లో నాణ్యమైన కాయలు ఏరికోరి పల్లెరంగా పెట్టి సొంతంగా మొక్కలు తయారు చేసుకునేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి మొక్కలు దిగుబడి చేసుకోవడంతో చీడపీడలు ఎక్కువయ్యాయని తెలిపారు. కొబ్బరి ఇన్సూరెన్స్ విషయంలో అధికారుల తీరు సక్రమంగా లేదని రైతులు విప్ దృష్టికి తీసుకొచ్చారు. సమాచారం సరైన సమయానికి ఇవ్వడం లేదని ఆరోపించారు. కొబ్బరి ప్రధాన పంట అయిన ఉద్దానం రైతులకు లక్ష్యం పేరుతో మొండిచేయి చూపిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విప్ స్పందిస్తూ ఇటీవల కొత్తగా వచ్చిన పలువురు ఉద్యానశాఖ సహాయకుల పనితీరు సక్రమంగా లేదని, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విప్, ఉద్యాన శాఖ అధికారులను చిక్కాఫ్ ఆధ్వర్యాన సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, చిక్కాఫ్ అధ్యక్షుడు జోహార్ ఖాన్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, టిడిపి కవిటి, కంచిలి మండలాల అధ్యక్షులు పొందల కృష్ణారావు, మాదిన రామారావు, ఎడిహెచ్ చిట్టిబాబు, ఉద్యానశాఖ అధికారి మాధవీలత పాల్గొన్నారు.

క్యూలో వేచి ఉన్న రైతులు

యూరియా కోసం బారులు

ప్రజాశక్తి - బూర్జ : మండలంలోని కొరగాంలో రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే యూరియా ఇస్తున్నారని రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణి అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై సీరియస్ అయ్యారు. పోలీసుల బందోబస్తు మధ్య ఎఒ సమక్షంలో 91 యూరియా బ్యాగులను పంపిణీ చేశారు.

పలుచోట్ల వర్షాలు

సంతబొమ్మాళి మండలంలో అత్యధికంగా 95.4 మి.మీ వర్షం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో సగటున 32.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఎనిమిది మండలాల్లో 50 మి.మీ పైన వర్షపాతం నమోదైంది. సంతబొమ్మాళిలో అత్యధికంగా 95.4 మి.మీ వర్షం పడింది. కోటబొమ్మాళిలో 93.8 మి.మీ వర్షం కురిసింది. పలాసలో 78.2 మి.మీ, మందసలో 74.2 మి.మీ, గారలో 70.2 మి.మీ వర్షం పడింది.

వజ్రపుకొత్తూరులో 67.4 మి.మీ, సరుబుజ్జిలిలో 65.6 మి.మీ, టెక్కలిలో 58.2 మి.మీ వర్షం కురిసింది. పోలాకిలో 40.6 మి.మీ, మెళియాపుట్టిలో 39.2 మి.మీ, హిరమండలంలో 33.6 మి.మీ, జలుమూరులో 32.2 మి.మీ, పాతపట్నంలో 30.4 మి.మీ, శ్రీకాకుళంలో 24.8 మి.మీ, ఎచ్చెర్లలో 16.6 మి.మీ వర్షం కురిసింది. రణస్థలంలో అత్యల్పంగా 2.2 మి.మీ వర్షం పడింది.

మాట్లాడుతున్న హరిబాబు

పౌర హక్కుల రక్షణకు న్యాయ సేవల అండ

ప్రజాశక్తి - రణస్థలం

షెడ్యూల్ కులాలు, తెగలపై దాడులు జరిగితే భయ పడాల్సిన అవసరం లేదని, సంబంధిత చట్టాలను వినియోగించుకుని న్యాయం పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు స్పష్టం చేశారు. మండలంలోని కోష్టలో న్యాయ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోయినా, బాధితులు నేరుగా ప్రైవేట్ కంప్లైంట్ రూపంలో కోర్టులో దాఖలు చేసుకోవచ్చని చెప్పారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యాన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ త్రైమాసికంగా కేసుల పురోగతిని సమీక్షించాల్సి ఉంటుందని వివరించారు. పౌర హక్కుల రక్షణ చట్టం ప్రకారం ప్రతి పౌరునికి ప్రభుత్వం రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. పౌర హక్కుల రక్షణ చట్టం ప్రకారం పౌరుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించడానికి ప్రాథమిక హక్కులు కల్పించిందన్నారు. ఈ ప్రాథమిక హక్కులకు భంగం కలిగిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, ఎస్ఐ చిరంజీవి, కూటమి నాయకులు పి.జగన్నాథరావు, పి.అసిరినాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నమోదై, పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. గంజాయి కేసుల దర్యాప్తు, నాన్ బెయిలబుల్ వారెంట్స్, అమలు, పెండింగ్‌కు గల కారణాలపై నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి కేసులో నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సదరు కేసుల్లో ఎన్.బి.డబ్ల్యు వివరాలను స్టేషన్ల వారీగా ఆరా తీశారు. కోర్టు జారీ చేసిన ఎన్‌బిడబ్ల్యులపై నిరక్ష్యం వహించకుండా ప్రాధాన్యతా క్రమంలో వాటిని అమలు చేసి, వీలైనంత త్వరగా కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. గంజాయి కేసుల దర్యాప్తు పెండింగ్‌కు గల కారణాలు ఆరా తీసి, పాత నేరస్తులను బైండోవర్ చేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎన్.బి.డబ్ల్యుదారుల వ్యక్తిగత వివరాలు, చిరునామా, ఇతర ఆధారాలు, సాంకేతికతను అనుసరించి వారిని గుర్తించి కోర్టులో హాజరు పరచాలని సూచించారు. ఎన్.బి.డబ్ల్యు సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక పోలీసు బృందాల ద్వారా ఇతర జిల్లా, రాష్ట్ర పరిధిలో ఎన్.బి.డబ్ల్యును ఎగ్జిక్యూటివ్ చేయాలని దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ గోవిందరావు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - పలాస

పలాస నియోజకవర్గంలో రైతులకు ఉపయోగపడే విధంగా కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రైతుబజారు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. రైతుబంధు పథకం ద్వారా కార్యాలయ పరిధిలో జీడిపిక్కల గోదాములు, స్వల్పకాలిక రుణ సదుపాయం రైతులకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎఎంసి కార్యదర్శి ఆంధ్రయ్య, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, ఎఎంసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

2047 విజన్‌లో భాగంగా నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో విజన్-2047పై విజన్ టీం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో విజన్-2047 కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పి-4పై మార్గదర్శకాలు, తాజా లక్ష్యాల ప్రకారం కొత్త మార్గదర్శులను గుర్తించడంపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో విజన్ 2047 పలాస ప్రత్యేక అధికారి మధుసూదనరావు, యు.శ్రీనివాసరావు, డివిఎపి ప్రసన్న కుమార్, ఎల్.ఎస్ సూర్యకుమార్, సివిఎపి యూనిట్ సభ్యులు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డిఎస్‌సి ఎంపిక జాబితా మేరకు జిల్లాలకు సంబంధించి 543 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. గత నెల 28, 29 తేదీల్లో మెరిట్ ప్రాతిపదికన ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 531 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరయ్యారు. 12 మందిలో కొందరు ఉద్యోగంలో చేరేందుకు ఆసక్తి చూపలేదు. మరికొందరు రిజెక్టు అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రతిభ రోస్టర్ మేరకు 12 మందికి విద్యాశాఖ కాల్ లెటర్లు మంజూరు చేయగా, విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం 12 మందికి ధృవీకరణ పత్రాలు పరిశీలించారు. మొత్తం 543 మందిని ధ్రువీకరణ పత్రాలు పరిశీలన పూర్తి చేశారు. రాష్ట్ర విద్యాశాఖ సూచనల మేరకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులు ఫేస్‌మెంట్ ఖరారు చేయనున్నట్లు ఇన్‌ఛార్జ్ డిఇఒ రవిబాబు తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో టాప్‌లో నిలవాలి

శ్రీకాకుళం సిటీ : జిల్లాకు అధిక సంఖ్యలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు వచ్చేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. అవార్డులు గెలుచుకున్న వారికి రూ.లక్ష రివార్డు, జిల్లాస్థాయి అవార్డులకు రూ.25 వేల వరకు ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. కలెక్టరేట్ నుంచి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ రెండో తేదీన నిర్వహించే కార్యక్రమంలో స్వచ్ఛ మున్సిపాల్టీలు, పంచాయతీలు, పాఠశాలలు, అంగన్వాడీలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైతుబజార్లు, హాస్టల్స్, పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలు, స్వచ్ఛత వారియర్స్ తదితర విభాగాల్లో రాష్ట్రస్థాయిలో 52, జిల్లాస్థాయిలో 1,421 కలిపి మొత్తం 1,473 అవార్డులు ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లా నుంచి అధిక సంఖ్యలో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. స్వర్ణాంధ్ర 2047లో 21 శాఖల కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ప్రోగ్రెస్ రిపోర్టులు, 2025-26లో 31 శాఖల జిల్లా ఇండికేటర్ల రిపోర్టులు వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. అన్న క్యాంటీన్, మున్సిపల్ సర్వీసులు, మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, పిజిఆర్ఎస్, కోర్టు కేసులు, సీజనల్ వ్యాధులపై సన్నద్ధత, నీటి పరీక్షలు, పంచాయతీల్లో పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు.

యూరియా కొరత రాకూడదు

జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృత్రిమ కొరత నివారించేందుకు అగ్రికల్చర్, కోఆపరేటివ్, మార్క్‌ఫెడ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంఆర్‌పి కన్నా ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీగా వస్తున్న తమ్మినేని సీతారాం

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి నష్టపోతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15 వేల భృతి ఇచ్చి ఆదుకోవాలని మాజీ స్పీకర్, వైసిపి సీనియర్ నాయకులు తమ్మినేని సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు భృతి ఇవ్వాలని, సంక్షేమ చట్టం చేయాలని కోరుతూ పట్టణంలోని కృష్ణాపురం కూడలి నుంచి ప్రధాన రోడ్డు మీదుగా వైఎస్సార్ విగ్రహం వరకు ఆటో డ్రైవర్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా ఆటో, వ్యాన్లు నడిపినా పూట గడవడమే కష్టంగా మారిందన్నారు. ప్రైవేటు ఫైనాన్స్‌కు వాయిదాలు కట్టలేక, కుటుంబ పోషణకు, చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, విజయనగరం లోక్‌సభ పరిశీలకులు కె.వి.వి సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, తమ్మినేని చిరంజీవి నాగ్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహా రాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు వారి దివ్య సముఖమునకు
A.S No.30/2024

Between:-
వావిలిపల్లి సుజాత ....అప్పీలెంట్
And:-
పప్పల సత్యనారాయణ మరియు వగైరాలు ....రెస్పాడెంట్స్

To,
R-13: చదువుల శ్రావణ కుమార్, S/o లేటు విజయ కుమార్, సాకేన వేంకటేశ్వర కాలనీ, పొందూరు గ్రామం.
R-14: చదువుల సింధు, S/o లేటు విజయ కుమార్, సాకేన వేంకటేశ్వర కాలనీ, పొందూరు గ్రామం.
R-15: గురుగుబిల్లి సుజాత, S/o లేటు అప్పారావు, సాకేన వేంకటేశ్వర కాలనీ, పొందూరు గ్రామం.
R-17: గురుగుబిల్లి రోజా కుమారి, S/o లేటు అప్పారావు, సాకేన వేంకటేశ్వర కాలనీ, పొందూరు గ్రామం. పొందూరు మండలం, పొందూరు పోస్ట్, శ్రీకాకులం జిల్లా.

పై నెంబర్ లో అప్పీలెంట్ పొందూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ లో OS No.54/2016 ఫైలు డిక్రీ జడ్జిమెంట్ తే.23-08-2024 పైన అప్పీల్ దాఖలు చేసి మీ వగైరాలకు అప్పీల్ నోటీస్లు చాలా సార్లు పంపించినప్పటికి మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. మీ వగైరాలు మీద పైనెంబర్ అప్పీల్ ధాఖలు చేసినందున మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల మీ వగైరాలు స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని **తే. 17-09-025 ది ఉదయం గం॥ 10-30ని॥** పై కోర్ట్ వారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమనందు తీర్మానం చేయడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

రాజాం.
02-09-2025.

వై. సత్య శ్రీనివాస్
అప్పీలెంట్ తరపు న్యాయవాది,
సెల్: 8309885495.

మురుగునీటిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మురుగునీటిని తొలగించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బిసి కాలనీలో పేరుకుపోయిన మురుగు నీటిని వెంటనే తొలగించాలని సిపిఎం నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని చినవంక పంచాయతీ గుల్లలపాడు బిసి కాలనీని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మురుగునీరు వెళ్లేందుకు తోవలేకపోవడంతో ఇళ్ల చుట్టూ పేరుకుపోయి మురుగుతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీ చుట్టూ మోకాళ్ల లోతుకి చేరిందని అన్నారు. అలాగే దోమలు విపరీతంగా పెరిగి అనారోగ్యానికి గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాకపోకలకు గత్యంతరం లేక మురుగు నీటిలోనే నడకలు సాగించిడం వల్ల రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న విప్ అశోక్

కంప్యూటర్‌పై శిక్షణ

ఇచ్ఛాపురం : వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ శిక్షణలో దూసుకుపోవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యాన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన వేడుకలు నిర్వహించారు. 'దాసరి బుజ్జి స్వచ్ఛంద సంస్థ' ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను విప్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాసరి శేఖర్, డైరెక్టర్లు దుంగు భాస్కర్, డైరెక్టర్లు బాసి భారతి, రాజశేఖర్, మండల అధ్యక్షులు నీలవేణిరెడ్డి, డొక్కరి శారదా ఈశ్వర్, టిడిపి నాయకులు పత్రీ తవిటియ్య, నందిగాం కోటేశ్వరరావు, లీలారాణి, కాళ్ల దిలీప్, దక్కత కామేశ్వరరావు, దక్కత ఢిల్లీరావు, నందికి జాని, కాళ్ల జయదేవ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ఆమదాలవలస : పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనే చేయంగా పనిచేస్తున్నామని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో ఎల్ఆర్ఎస్, బిపిఎస్ స్కీం నిధులతో రూ.11 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, కాలువల అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్ చొరవతో పురపాలక సంఘానికి అత్యధిక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులు విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. వార్డుల్లో అభివృద్ధి పనులు పూర్తయితే రవాణా సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, టిడిపి పట్టణ అధ్యక్షులు సంపదరావు, మురళి, బోర గోవిందరావు, బాలకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదినం

శ్రీకాకుళం సిటీ : రక్తదానం చేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రక్తదాతలే నిజమైన ప్రాణదాతలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఆధ్వర్యాన పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను 65వ సారి రక్తదానం చేశారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ సిబ్బ ందితో రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, సీనియర్ జర్నలిస్టు ఎం.సుధీర్‌వర్మ, ఈవెంట్ ఆర్గనైజర్ సాయిబాబా, అఖిల భారత చిరంజీవి యువత ఉత్తరాంధ్ర కార్యదర్శి వైశ్యరాజు మోహన్ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: పవన్‌కళ్యాణ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు తన క్యాంప్ కార్యాలయం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు పిషిని చంద్రమోహన్, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, బడాన జనార్ధనరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని జాడపూడిలో మంగళవారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి ప్రారంభించిన ఈ శిబిరంలో 30కి పైగా యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో రక్తం కొరతతో ఎవరు ప్రాణాలు కోల్పోకూడదని, ప్రతి ఒక్కరికి రక్తం అందేలా జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు.

ఇచ్ఛాపురం: పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని డొంకూరులో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. 200 మందికి పైగా యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, మత్స్యకార విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, మండల అధ్యక్షులు దుర్గాసి నీలవేణిరెడ్డి, జానకిరామ్ వల్లభాయ్ సంతోష్ తులసి పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక కెవిఆర్ థియేటర్ వద్ద పవన్‌కళ్యాణ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, జి.షర్మిలారాణి ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 45 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, బాబూరావు, సిమ్మినాయుడు, కాలేపు శ్రీనివాసరావు, అప్పలనాయుడు, రాజారావు, దినేష్, మనోజు, గోవిందు, పురుషోత్తం, కె.శ్రీను పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణ శివారున ఉన్న ఫ్లై ఓవర్ వద్ద పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యాన నిర్వహించారుర. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 116 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. భారీ కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఆంధ్ర రాష్ట్ర అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్నం రక్తదాన శిబిరం వద్ద సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ బిజెపి కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, దూసి ఆయకట్టు చైర్మన్ హనుమంతు బాలకృష్ణ పిఎసిఎస్ చైర్మన్ మాధవి, టిడిపి నాయకులు మొదలవలస రమేష్ ఆపల్గొన్నారు.

టెక్కలి : పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా జనసేన కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాగోటి అనిల్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

మెళియాపుట్టి స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు దుక్క బాలరాజు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, సర్పంచ్ వై.ఈశ్వరరావు, ఎన్.చిన్నికృష్ణ, గోపమ్మ మజ్జు పాల్గొన్నారు.

కొత్తూరు : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన నాయకులు కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జయరాజ్, కె.రాజ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

నరసన్నపేట : జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యాన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. వరయ్య, త్రివేణీరావు, వెంకటరమణ, సోమేష్, రాజారావు, రమేష్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సామాజిక కార్యకర్త లమ్మత శ్రీనివాస్, శ్రావణి దంపతులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని కోటపాడు పంచాయతీ బృందావనంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టెక్కలి జనసేన పార్టీ సమన్వయకర్త కణితి కిరణ్ కుమార్ చేతుల మీదుగా మొత్తం 180 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు.

నరసన్నపేట : చిన్నారులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

పొందూరు : రక్తదానం చేస్తున్న జనసైనికులు

బూర్జ : మండలంలోని కొల్లివలసలోని పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 67 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు చంద్రమోహన్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు, జనసేన నాయకులు కొత్తకోట నాగేంద్ర, కోరుకొండ మల్లేశ్వరరావు, ఎంపిటిసి అంపిలి విక్రమ్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, ఎస్ఐ ప్రవళిక, బిజెపి ఇన్‌ఛార్జి స్వరూప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలాస : పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.దుర్గారావు కిడ్నీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అంతకముందు ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, జనసేన నాయకులు నందిగాం ధర్మారావు, కేదార్నాథ్, తుంగాన దేవరాజ్, శంకు శ్రీకాంత్, దీనా పాత్రో, బుడ్డ కిషోర్, కీలు సునీల్ వర్మ, గణేష్‌రెడ్డి, దున్న సంపత్, చందు పాత్రో, మణికంఠ, మర్రి పృథ్వీ, సంతోష్, హేమంత్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సింగుపురం పంచాయతీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మండలం దంత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జనసేన నాయకులు నక్క సోమేశ్వరరావు, లండ పవన్‌కుమార్, రామారావులు పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా పిచ్చిమొక్కలు

తుంగపేట వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి- పొందూరు

రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ప్రజల పాలిట ప్రమాదకరంగా మారుతున్నాయి. రహదారుల్లోని మలుపులు వద్ద పిచ్చిమొక్కలు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. మండలంలోని పలు రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని రైల్వేస్టేషన్ నుంచి తుంగపేట మీదుగా తాడివలస రహదారి, కింతలి నుంచి రాపాక కూడలి రహదారి, లక్ష్మీపేట నుంచి బాణాం రహదారి, పొందూరు నుంచి తండ్యాం మీదుగా మలకాం పోయే రహదారి, పొందూరు నుంచి చిలకపాలెం వెళ్లే రహదారితో పాటు పలు గ్రామీణ రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షాకాలం కావడంతో పిచ్చిమొక్కలు దట్టంగా, ఏపుగా పెరిగిపోతున్నాయంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. రహదారులకు ఇరువైపులా గల పిచ్చి మొక్కలను తొలగించి ప్రమాదాలను నివారించేలా ఆర్అండ్‌బి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బంటుపల్లిలో యూరియా పంపిణీ

రణస్థలం రూరల్: రైతులందరికీ అవసరమైన యూరియాను అందజేస్తామని బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజనీ తెలిపారు. బంటుపల్లి పంచాయతీ సచివాలయంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరు కావాలని యూరియాపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, రైతులు వాటిని నమ్మవద్దని సూచించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ వరుణ్, తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవికుమార్, చింతపల్లి వెంకట రాజేష్, ఎన్.గోపి, గోపిన నారాయణరావు, టి.వెంకటేష్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేస్తున్న సర్పంచ్ రజని

క్రైమ్ కార్నర్

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సింహాచలం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని వడ్డివాడ వద్ద సోమవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టెక్కలి మండలం అక్కవరానికి చెందిన మురపాల రెయ్యమ్మ (41) మేస్త్రీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంది. బోరుభద్రలో పని ముగించుకొని మేస్త్రీ తంగి రామారావు ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుంది. వారితో పాటు మరో బైక్‌పై వస్తున్న నెయ్యిల రామకృష్ణ వాహనం అదుపుతప్పి పడిపోయింది. పక్కనే వస్తున్న రామారావు వాహనాన్ని రామకృష్ణ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ రోడ్డుపై పడ్డారు. రెయ్యమ్మ తీవ్రంగా గాయపడింది. వెంటనే కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త కృష్ణారావు, కుమారు, కుమార్తె భవని ఉన్నారు. కుమార్తె ఫిర్యాదు మేరకు సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గవరయ్య

కళాసీ ఆత్మహత్యాయత్నం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 23వ వార్డు కాపు వీధికి చెందిన కోరాడ గవరయ్య మంగళవారం పదునైన ఆయుధంతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రక్తపు మడుగులో పడి ఉన్న గవరయ్యను గురించి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించారు. కుటుంబ కలహాలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. కళాసీ పనిచేస్తున్న గవరయ్య గత కొద్ది రోజులుగా మద్యం తాగుతూ పనికి వెళ్లకుండా భార్య ధనలక్ష్మితో గొడవ పడేవాడని తెలుస్తోంది. ధనలక్ష్మి జీడి కార్మికురాలు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పొందూరు: మండలంలోని ధర్మపురానికి చెందిన మొదలవలస వరాహ నర్సింహులు (57) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మృతుడుకి ఆరోగ్య సమస్యలతో పాటు గ్రామంలో కొంతమందితో స్థల వివాదం నెలకొని ఉంది. ఈ సమస్యల నేపథ్యంలో క్షణకావేశంలో సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీనిపై మృతుని భార్య సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామారావుకి ఆత్మీయ సత్కారం

రామారావును సన్మానిస్తున్న యువత

కవిటి : సమాజ సేవకుడు, మానవతావాది కవిటికి చెందిన పాండవ రామారావుకు రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యాన స్థానిక అగ్నికుల క్షత్రియ వీధిలో మంగళవారం ఘనంగా సన్మానించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘ అధ్యకుడు పొల్లాయి లక్ష్మణమూర్తి మాట్లాడారు. స్వశక్తితో పైకివచ్చి ఎందరికో అండగా నిలిచిన రామారావు ఉదార స్వభావాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు, రైజింగ్ స్టార్ యువత, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

హోంగార్డు కుమారునికి మెడికల్ సీటు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి అభినందనలు

అభినందిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం సిటీ: మెడికల్ సీటు సాధించిన హోంగార్డు కుమారుని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి మంగళవారం అభినందించారు. జిల్లా పోలీసు శాఖలో పాతపట్నం సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు చక్క వాసుదేవరావు కుమారుడు శశిధర్ నాయుడు ఇటీవల నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించారు. ఈ మేరకు ఎన్నారై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విశాఖపట్నం)లో ఎంబిబిఎస్ సీటును సాధించి సత్తా చాటుకున్నారు. శశిధర్ తన తల్లిదండ్రులతో కలిసి మర్యాద పూర్వకంగా మంగళవారం పోలీస్ కార్యాలయంలో కలిశారు. ఎస్‌పి మాట్లాడుతూ పేద కుటుంబ నుంచి, కష్టాన్ని జయించి, దృఢ సంకల్పంతో చదువుకుని మెడికల్ సిట్ సాధించడం అభినందనీయమని అనానరు. ఇది పోలీసుశాఖలో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి ప్రేరణనిచ్చే విషయమని అన్నారు. పిల్లల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యతనిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

గురువులకు సత్కారం

సన్మాన గ్రహీతలతో గ్రామస్తులు

కవిటి: గత కొన్నేళ్లుగా తమ పాఠశాలలో విద్యార్థులను తీర్చిదిద్ది, తమ పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసి ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులకు బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో భాగంగా పిరియా వేణుగోపాల్, వజ్రగడి ధనశ్రీ, ఇ.తవిటినాయుడు, ఎస్.నీలిమ, ఆర్.శైలజ, వి.జగదీశ్వరి, జి.శంకరరావు, ఎం.వైకుంఠరావు పాఠశాలకు అందించిన సేవలు గుర్తుచేస్తూ వారిని సత్కరించారు. వారి భవిష్యత్ జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, ఎస్ఎంసి చైర్మన్ బల్లెడ సౌమ్యా శ్రీపతి, బల్లెడ జయప్రకాష్ పాల్గొన్నారు.

కళ్యాణికి ఘన సన్మానం

కళ్యాణికి సన్మానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రం బ్రాహ్మణ వీధిలో ఉన్న కళ్యాణి నేత్రాస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణికి విశాఖ ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం సన్మానించారు. శంకర్ ఫౌండే షన్ వ్యవస్థాపకులు ఆత్మకూరి శంకరరావు జయంతిని పురస్కరించుకుని సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ రణస్థలం కళ్యాణి కంటి ఆస్పత్రి ద్వారా ఈ ఏడాది శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రికి 270 మందిని పంపించి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించామని తెలిపారు. ఈ సన్మానంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. మరిన్ని ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చూపు లేని వారికి చూపు అందించేందుకు శక్తి వంచన లేకుండా కష్టపడి పనిచేస్తానన్నారు.

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నేత్రదానంపై ముందుకు రావాలని సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.జె.ఎస్.ప్రసాదరావు అన్నారు. మంగళవారం నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా మండల కేంద్రంలో నేత్రదానంపై అవగాహన కల్పించారు. ముందుగా అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా నేత్రదాన ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. నేత్రదానం వల్ల అనేకమందికి వెలుగు చూపించవచ్చని, ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి నేత్రదాతలుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన సంతబొమ్మాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి ఆరోగ్యం-నేత్రదానంపై వైద్యాధికారి కె.శివరంజని మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మరణానంతరం నేత్రదానం కుటుంబ సంప్రదాయం చేయాలని పిలుపునిచ్చారు. ఆప్తమాలమిక్ అధికారి ఎం.ఆర్.కెదాస్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి నేత్రదానంపై అవగాహన కల్పించారు.

మెళియాపుట్టి : మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాదరావు

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

పలాస : మాట్లాడుతున్న సురేష్‌కుమార్

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు ఆలోచించగలిగితే ప్రశ్నించేతత్వం అలవడుతుందని, ఈ దిశగా అధ్యాపకులు చొరవ చూపాలని ఇంటర్ విద్య డివిఇఒ ఆర్.సురేష్ కుమార్ అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటినుంచే ఉత్తమ ఫలితాల దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుల రికార్డులను, కళాశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉజ్వల భవితకు ఇంటర్ పునాది కావాలని ఇందుకు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నందిగాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ఐఒ పి.దుర్గారావు జిల్లా వృత్తి విద్యాధికారి సురేష్‌కుమార్ మంగళవారం కాలేజీని పరిశీలించారు. సందర్భంగా కళాశాలలోని రికార్డులు అటెండెన్స్ టీచింగ్ నోట్స్ కళాశాల పరిసరాలు పరిశీలించారు. వచ్చే ఏడాదికి అధిక సంఖ్యలో విద్యార్థులు చేరేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నౌపాడ ప్రిన్సిపాల్ భీమేశ్వరరావు, నందిగాం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ మారుప కృష్ణమోహన్, అధ్యాపకులు పి.వెంకటరావు, ఎ.పోలయ్య, చంద్రయ్య, నారాయణరావు, అరవింద్, సంపద రాబి, చిరంజీవి పాల్గొన్నారు.

పిడుగు పడి రైతు మృతి

రమేష్ (ఫైల్)

టెక్కలి రూరల్ : మండలంలో పోలవరంలో ధవళ రమేష (51) మంగళవారం పిడుగు పడి మృతి చెందాడు. సాయంత్రం పొలం పనులకు వెళ్లాడు. ఈ సమయంలో ఆయనపై పిడుగు పడడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. పొలం వెళ్లి వెళ్లిన వ్యక్తి ఎప్పటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి నారాయణరావు రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నిరోషకు సన్మానం

సన్మానిస్తున్న ఉద్యోగులు

టెక్కలి : మండలంలోని పరశురాంపురానికి చెందిన దళిత మహిళ కురమాన నిరోష ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షలు పాల్గొని ఐదు ఉద్యోగాలకు అర్హత సాధించింది. దీంతో దళిత సంఘ నాయకులు మంగళవారం నిరోషకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అణగారిన తరగతికి చెందిన మహిళ డిఎస్‌సి పోటీ పరీక్షలో ఆపల్గొని ఐదు విభాగాల్లో ప్రతిభకనబరిచి విజేతగా నిలవడం గర్వనీయమన్నారు. వివాహితగా శ్రమించిన ఆమె కృషి దళిత మహిళలకు ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రెయ్యి రామారావు, విశ్రాంత ఆటవీశాఖాధికారి కర్ణిక గాంధీ, జర్జాన బాబాబూరావు, పిసిన జగదీష్, యజ్జల గణేష్, గువ్వాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పలాస విద్యార్థుల సత్తా

అభినందిస్తున్న అధ్యాపకులు

పలాస : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక జాబ్‌మేళాలో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. టాటా గ్రూప్, ఎంఆర్ఎఫ్, స్నిడర్ వంటి కంపెనీలకు సుమారు 40 మంది ఎంపికయ్యారని అన్నారు. జూనియర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు 23 మంది వార్షిక వేతనం రూ 2,28,000లకు, మిషన్ ఆపరేటర్ ఉద్యోగాలకు 11 మంది ఎంఆర్ఎఫ్ కంపెనీలో వార్షిక వేతనం రూ.2,16,000లకు, అసెంబుల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఆరుగురు స్నిడర్ ఎస్ఎంఎల్ ఆపరేటర్ ఉద్యోగాలకు వార్షిక వేతనం రూ 2,04,000లకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి ఉచిత భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఆయా కంపెనీలు భరించనున్నాయని అన్నారు. చెన్నై, హైదరాబాద్ నగరాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. గత రెండేళ్లుగా ఎంపిక అవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ పి.వెంకటరమణ, అధ్యాపకులు శ్రీనివాస్ పట్నాయక్, హేమాచలం, హేమరాజు, గిరిజ పాల్గొన్నారు.

థర్మల్ పవర్ ప్రాజెక్టుతో మహర్దశ

ఆమదాలవలస : నియోజకవర్గంలోని సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద ప్రతిపాదిత సుమారు రూ.32 వేల కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ వల్ల నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందని విశ్రాంత తహశీల్దార్, టిడిపి నాయకులు, విజయనగరం జిల్లా కాళింగ సంక్షేమ సంఘం మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పేడాడ జనార్ధనరావు అన్నారు. మండలంలో శ్రీహరిపురంలో తన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు, విశ్రాంత తహశీల్దార్ రమణారావు, విశ్రాంత కమిషనర్ బాలాజీప్రసాద్, సీపాన వెంకటరావు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెచ్‌ఎంలు

లావేరు ఎంఇఒగా శ్రీరాములు

లావేరు : లావేరు మండల ఎంఇఒగా గట్టు శ్రీరాములు నియమితులైయ్యారు. ఈయన మంగళవారం తన ఉద్యోగ బాధ్యతల్లో చేరారు. ఈయన పొందూరు ఎంఇఒగా పనిచేస్తూ... ఎక్కడికి బదిలీపై వచ్చారు. ఈయనకు ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఇఒలు వాగ్దేవి, మురళీకృష్ణ, లావేరు హెచ్‌ఎం పి.జగన్నాథం, తెలుగు పండిట్ సంఘ జిల్లా నాయకులు పిసిన వసంతరావు, సిఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి- పలాస

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ వసంతకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 ఏడాదికి సంబంధించి ప్రభుత్వం విడుదల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం సద్గుణబాబు 2.0 పై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, వైస్ ఎంపిపి తలగాన శ్రీరాములు పాల్గొన్నారు.

బూర్జ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిటిసిలకు, సర్పంచ్‌లకు ఎంపిడిఒ తిరుపతిరావు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంపిపి కె.దీప అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణలో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనేవు రామకృష్ణ నాయుడు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి పాల్గొన్నారు.

బూర్జ : మాట్లాడుతున్న రామకృష్ణ నాయుడు

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

టెక్నాలజీని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతులు తమ వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల మండలంలోని ఇబ్రహీం బాద్లోని భాగ్యలక్ష్మి సంఘం వారికి సబ్సిడీపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అందించిన ఎఫ్ఎంబి కిసాన్ డ్రోన్ యూనిట్లను మంగళవారం ఆయన తన కార్యాలయం ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ వినియోగం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పాదకత సాధించవచ్చన్నారు. ప్రభుత్వం రైతుల కోసం అనేక ఆధునిక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంపతరావు నాగేశ్వరరావు, సనపల రామారావు, పిన్నింటి భానోజీనాయుడు, ఎంపిటిసి వెంకటరమణ, వావిలాపల్లి రామస్వామి, రామారావు మాస్టర్, జె.శ్రీనివాస్, శంబాన రమేష్, గురాల రఘునాథ్, వెలిచేటి రామకృష్ణ, గోవిందాసు త్రినాథ్, వ్యవసాయశాఖ ఎడి, ఎఇలు పాల్గొన్నారు.

విజేతలతో నిర్వాహకులు

లఘు చిత్ర విజేత 'బివేర్'

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంకలో రాష్ట్రస్థాయి లఘు చిత్ర (షార్ట్ ఫిలిం) పోటీలు మంగళవారం నిర్వహించారు. బాలగణపతి వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీల్లో చిన్నకర్రివానిపాలెంకు చెందిన బన్నీ టీమ్ నిర్మించిన 'బివేర్' చిత్రం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానం ఎం.ఎస్.పల్లికి చెందిన 'తప్పెవరది', తతీయ స్థానం బొరివంకకు చెందిన 'నాన్న మాట' లఘు చిత్రాలకు లభించాయి. ప్రత్యేక బహుమతులు పలాసా ప్రాజెక్ట్-హెచ్, డ్రగ్స్, చిన్నకర్రివానిపాలెం ప్రాజెక్ట్-హెచ్, వరక వారధి, కత్తివరం బి-అలెర్ట్, కపాసుకుద్ది హెల్మెట్, బొరివంక స్వయం కతాపరాదం, బొర్రపుట్టుగ డెవిల్ జట్లు గెలుచుకున్నాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్, కళింగ సీమ కళాపీఠం అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి, సీనియర్ జర్నలిస్టు మద్దిలి కేశవరావు వ్యవహరించారు. విజేతలకు ఎంఇఒలు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ, సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, స్వచ్ఛంధసేవా సంస్థ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు, యూత్ క్లబ్ అధ్యక్షుడు లొట్ల దీనబంధు, ఉపాధ్యక్షుడు కాళిదాసు, పూర్ణచందర్, బల్లెడ జయప్రకాశ్ బహుమతులు అందజేశారు.

శిక్షణ ఇస్తున్న జెసిఐ ప్రతినిధులు

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జెసిఐ ఆధ్వర్యాన ఆదిత్య కాలేజీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 'ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్' అనే అంశంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధికి ఈ కార్యక్రమాన్ని జాతీయ ట్రైనర్ శ్రీనివాస్ సోను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి విలువైన శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్న జెసిఐ ఇచ్ఛాపురానికి అభినందనలు తెలిపారు. అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి శిక్షణా అవకాశాలను తప్పక వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జోన్ ఆఫీసర్ తంగుడు శణ్ముఖ్, సభ్యుడు సంతోష్ సాహు పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులను టెక్కలి పట్టణంలో మంగళవారం పంపిణీ చేశారు. డీలర్ల సంఘం అధ్యక్షులు కిడిమి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ కార్డులను అందజేశారు. మండలంలోని 27 పంచాయతీలకు 50 వరకు చౌక ధరల దుకాణాలు ఉన్నాయని అన్నారు. వీటిద్వారా 20 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే స్మార్ట్ కార్డులను అందజేశామని తెలిపారు. డీలర్ల వ్యవస్థ భాగంగా చేపట్టిన ఈ ప్రక్రియ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

కార్డులను అందజేస్తున్న శ్రీనివాసరావు

వైఎస్ఆర్ ఆశయసాధనకు కృషి

నరసన్నపేట : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కృష్ణదాస్

నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల మనసులో స్థిరస్థాయిగా నిలిచిపోయాయని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళి, ముద్దాడ భైరాగినాయుడు పాల్గొన్నారు.

కవిటి: స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రణస్థలం : రణస్థలంలోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కొండములగాం కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులకు వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీశీనివాసరావు పండ్లు పంపిణీ చేశారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి మండల అధ్యక్షులు అధ్యక్షులు తిర్రి రాజారావు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఉప్పర పల్లి ఉదయ్ కుమార్, జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్‌లు విద్యాసాగర్, లక్ష్మీనారాయణ, నాయకులు మడ్డు సుధీర్, జె.జె.రావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పొందూరు : పొందూరు అంబేద్కర్ కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి మండల అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతాడ సత్యప్రసాద్, వండాన వెంకటరావు, గాడు నాగరాజు, పైడి నాగభూషణం, గుడ్ల మోహనరావు, కిల్లాన సూర్యారావు, పెద్దింటి రవిబాబు, అగత రాంబాబు, బొత్స రమణ, పద్మావతి, కూన రవణమ్మ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : తహశీల్దార్ కార్యాలయం ఆవరణలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మెరుగు అప్పారావు, పొందల రామకృష్ణ, మార్పు నాగభూషణరావు, నక్కెట్ల నరేష్, బచ్చుల సుధాకర్ పాల్గొన్నారు. అలాగే మాజీ ఎఎంసి చైర్మన్ సుగ్గు రామిరెడ్డి సంతబొమ్మాళి పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

టెక్కలి రూరల్ : స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపిఅనుబంధ విభాగాల కార్యదర్శులు ఎర్ర చక్రవర్తి, గురునాథ్ యాదవ్, సుగ్గు రామిరెడ్డి, జిల్లా నాయకులు అన్నెపు రామారావు, కురమాన బాలకృష్ణ, ఎన్ని మన్మథరావు, భీమారావు టెక్కలి సర్పంచ్ గొండేల సుజాత, ఎంపిటిసి పీత హేమలత పాల్గొన్నారు.

పొందూరు : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైసిపి నాయకులు

ఇచ్ఛాపురం : స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వైసిపి నాయకులు ప్రతి అన్వేష్, నర్తు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ బొడ్డేపల్లిపేట నుంచి ఫ్లైఓవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం లెప్పర్సి కాలనీలో ప్రజలకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామ్, చింతాడ వెంకటరమణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం నందలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు, గిరిజన సంఘ నాయకులు సవర ఆదినాయుడు, సర్పంచ్ ప్రసాదరావు, ఎస్.అన్నయ్య పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు శిస్టు గోపి, హనుమంతు వెంకటరావు, ఉంగ సాయికృష్ణ, పైల చిట్టి పాల్గొన్నారు.

అలాగే మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆధ్వర్యాన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్, మరద భాస్కర్‌రెడ్డి, జుత్తు నీలకంఠం, వేణుగోపాల్, బద్రి సీతమ్మ, నీలాచలం పాల్గొన్నారు.

కవిటి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ

టెక్కలి : జెడ్‌పిటిసి దువ్వాడ వాణి స్వగృహంలో వైఎస్ఆర్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బొప్పాయిపురం, నర్సింగపల్లి, పరశురాంపురం, చాకిపల్లి, అక్కవరం సర్పంచ్‌లు గుజ్జుమోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, రౌతు జయమోహన్, మెయ్యి శంకరరావు, పొందర శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గండి అప్పలరెడ్డి, అట్ల రవికుమార్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మామిడి శ్రీకాంత్, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని మధురాపురంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిపి నిమ్మన దాసు, తడక జోగారావు, వైస్ ఎంపిపి గుర్రాల శ్రీను పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక రెల్లివీధిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి ప్రతినిధి సవర రమేష్, ఎంపిటిసి వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ పెద్దకోట సాధుబాబు, సర్పంచ్ ప్రతినిధి వైకుంఠరావు,, పోలయ్య, అప్పన్న పకీరు, గణేష్, సంజీవరావు, లింగరాజులు పూలమాలలు వేశారు.

కోటబొమ్మాళి : స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అన్నెపు రామారావు, సంపతిరావు హేమసుందరరాజు, నూక సత్యరాజు, దుక్క రామకృష్ణ, పేడాడ వెంకటరావు, కాళ్ల సంజీవరావు, బోనేల ఎల్లయ్య పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

సంతబొమ్మాళి : ఉపాధ్యాయులు వృత్తిపరంగా అంకితభావంతో పనిచేస్తే వారి సేవలు మంచి గుర్తింపు తెచ్చిపెడతాయని బోరుభద్ర జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ అన్నారు. పాఠశాలలో ఇంగ్లీష్ బోధన ఉపాధ్యాయులు జగదాంబ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఇఒ ఆకస్మిక తనిఖీ

నరసన్నపేట: పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఇఒ శాంతారావు సూచించారు. మండలంలోని మాకివలస ఎంపిపి స్కూల్‌ని మంగళవారం మంగళవారం ఆకస్మింగా తనికీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హజరు, మధ్యాహ్నం భోజనం పథకం, పరిసరాలు పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచితే బాగుంటుందని గ్రామ పెద్దలతో మాట్లాడారు. కార్యక్రమంలో వంశధార డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రి సలహా సంఘ సమావేశం

టెక్కలి రూరల్ : టెక్కలి జిల్లా ఆస్పత్రి సలహా సంఘ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పాల్గొంటారని తెలిపారు.

కృష్ణచైతన్య పరామర్శ

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలోని మారుతీ నగర్ వార్డు సభ్యులు రఘుపాత్రుని శ్రీధర్ (బుజ్జి) ఇటీవల చిన్న శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య మంగళవారం ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీపురు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

పలాస : నిల్వ ఉన్న ఆహార ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తామని జిల్లా జీవనోపాధుల డిపిఎం నారాయణరావు, ఐబి డిపిఎం కె.మోహనరావు అన్నారు. పలాస వెలుగు కార్యాలయంలో మంగళవారం సోంపేట క్లస్టర్ పరిధిలో ఉన్న ఏడు మండలాలు వెలుగు అధికారులకు నిల్వ ఉన్న ఆహార ఉత్పత్తుల కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పడాలు, బెల్లం చెక్కిలు, పిండి మిల్లు, పచ్చడిలు, రైస్ మిల్లు, జీడి పరిశ్రమలు, తెన్నే పెంపకం తదితర కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆదాయ పెంచుకోవడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే విధంగా చూడాలన్నారు. అటువంటి పరిశ్రమలకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనే విధంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలాస మండల సమాఖ్య అధ్యక్షులు జి.శాంతమ్మ, త్రివేణి, ఎపిఎంలు జాంబవతి, హరికృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారాయణరావు

అవసరానికి మించి యూరియా వాడవద్దు

సంతబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

వరిలో అవసరానికి మించి యూరియా వాడకూడదని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు రైతులకు సూచించారు. సంతబొమ్మాళి మండలం చిన్నతుంగంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సిఫార్సు చేసిన మోతాదుకు మించి యూరియా వాడితే పంటపై చీడపీడలు దాడి చేసి సస్యరక్షణ ఖర్చులు పెరుగుతుందన్నారు. దీంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాళ్లపేట అప్పారావు, సర్పంచ్ సిమ్మ గోవిందరావు, వ్యవసాయ సహాయకుడు కూన శశిభూషణరావు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బెలగాం, శిలగాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పిరియా శ్రీదేవి రైతులకు పలు సలహాలు సూచనలు అందించారు. యూరియా, డిఎపి ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ఇప్పటికే నాట్లు వేసిన వరి పంటకు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పంట దశలను బట్టి ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ సక్రమంగా పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌళో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల గుర్తింపు వేగవంతం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని రీ సర్వే చేసిన గ్రామాల్లో ప్రభుత్వ భూముల గుర్తింపు వేగయవంతం చేయాలని తహశీల్దార్ జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు, సర్వేయర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమోటో కేస్ట్ వేరీఫికేషన్ నీటి తిరువా వసూళ్లు, రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో ప్రభుత్వ భూముల వివరాలు, గుర్తింపు తదితర పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ధ్రువపత్రాలు మంజూరులో పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిటి డి.శ్రీనివాసరావు, ఆర్ఎస్ డిటి ఆర్.అప్పలరాజు, ఆర్ఐ పైడి హారతి, సీనియర్ సహాయకులు రత్నాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

దరఖాస్తుల స్వీకరణ

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పిలత తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో బోటనీ, కామర్స్, హిస్టరీ విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత జిరాక్స్‌లను ఈ నెల 3న సాయంత్రం 5 గంటలలోపు కళాశాలకు అందచేయలన్నారు. 4న ఉదయం 11 గంటల నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. పిహెచ్‌డి, ఎన్ఇటి, ఎస్ఇటి ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

బోటు ఇంజిన్ల పంపిణీ

పోలాకి : సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నాను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద 21 మంది మత్స్యకారులకు 50 శాతం రాయితీతో సామగ్రిని మంగళవారం అందజేశారు. రూ.32,19,300 విలువ కలిగిన బోటు ఇంజిన్లు, వలలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రేపు నందిగాం మండల సమావేశం

నందిగాం : ఈ నెల 4న ఉదయం 10 గంటలకు మండల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎం.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు విధిగా, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

108 సేవలు భేష్

పలాస : పలాస 108 వాహనాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయకర్త ప్రకాష్ పరిశీలించారు. 108 రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 108 వాహనంలో ఎటువంటి సేవలు అందిస్తున్నారు, ఎటువంటి మందులు అందుబాటులో ఉన్నాయి. క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నారా? అంశాలను అడిగి తెలుసుకున్నారు. రోగులు, గర్భిణులకు అందిస్తున్న సేవలు అమోఘమని, 108 సిబ్బంది సత్యం, కె.శ్రీనివాసరావుకు ప్రశంసలు కురిపించారు.